క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: రేవిడి సబ్ స్టేషన్, కోరాడ ఫీడర్ పరిధిలో వ్యవసాయ లైన్ వేరుచేసే పనులు చేపట్టనున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా లింగన్నపేట, బొత్సపేట, బుడ్డివలస, బీఆర్ తాళ్లవలస గ్రామాలకు ప్రకటించిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్‌డీఎస్ పనులు చేపట్టనున్నందున బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుందని ఏఈ తెలిపారు. పద్మనాభం, కృష్ణాపురం, ఐసకపాలెం, అర్చకునిపాలెం, శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, రామన్నపేట, తునివలస, నేరేళ్లవలస, కొయ్యపేట, మద్ది, విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం, విజయరాంపురం కురపల్లి, బర్లపేట, విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం



విద్యార్థులకు పుస్తకాల కిట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ రాంప్రసాద్

భీమునిపట్నం: విద్యార్థులందరూ ఇప్పటి నుంచే శ్రద్ధగా చదువుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్ సూచించారు. అప్పుడే వారు మంచి ఫలితాలను సాధించగలరన్నారు. సోమవారం ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కావడంతో, హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారన్నారు. అలాగే సదుపాయాలు కూడా ఉన్నాయని, వాటిని వినియోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన పుస్తకాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాను అంతం చేద్దాం



సుభాష్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొమ్మాది: అందరిలోనూ మార్పు వస్తే మలేరియాను అంతం చేయవచ్చని హెల్త్ అసిస్టెంట్ శేఖర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా సాగర్‌నగర్ పరిధి సుభాష్‌నగర్‌లో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నేడు

తగరపువలస: ఆనందపురం మండలం బోని, ఆనందపురం, వెల్లంకి పంచాయతీలలో మంగళవారం ఉదయం 10 గంటలకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి చావా సంధ్యా రత్నప్రభ తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు రైతులను సమాయత్తం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కొండేపూడికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో అనకాపల్లి శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి తెలియజేస్తారన్నారు.

తమ భూములు అప్పగించాలని కలెక్టర్‌కు వినతి

మహారాణిపేట : భీమిలి మండలం, సంగివలస గ్రామంలో తమకు తాత ముత్తాతల నుంచి సంక్రమించిన 60 సెంట్ల భూమిని తిరిగి తమకు అప్పగించాలని కోరుతూ సీహెచ్ విజయలక్ష్మి కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందించారు. 1967లో తన అత్తమామలు ఈ భూమిని కొనుగోలు చేశారని, 2020లో తన మామ ఇద్దరు కుమారుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. గతేడాది శ్రీను అనే వ్యక్తి బుల్డోజర్‌తో వచ్చి తమ భూమిని చదును చేయగా, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఆ తర్వాత శ్రీను రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 66 సెంట్ల భూమిని ఆన్‌లైన్‌లో తన పేరున నమోదు చేసుకున్నాడని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు తమకు అన్యాయం చేశారని వాపోయారు. ఆన్‌లైన్‌లో మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకుని, తమ స్థలాన్ని తిరిగి అప్పగించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పట్టపగలే చోరీలు

- వణుకుతున్న సామయ్యవలస ప్రజలు
- నెలలు గడుస్తున్నా దొరకని వస్తువుల ఆచూకీ
- పోలీస్ స్టేషన్ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు





గత నెల 17న రొంగలి సాధు ఇంట్లో బంగారం, నగదు చోరీకి గురైంది ఈ బీరువా నుంచే..

తగరపువలస: వరుస దొంగతనాలతో పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అవి కూడా పట్టపగలే జరగడంతో చోరీలకు పాల్పడుతున్న వారు స్థానికులా? బయట వ్యక్తులా అన్నది అంతుచిక్కడం లేదు. బయట వ్యక్తులైతే గ్రామంలో పగటిపూట చోరీలకు సాహసించలేరని, బాగా తెలిసిన గ్రామస్తుల సహకారంతో లేదా వారే ఈ వరుస చోరీలకు పాల్పడుతున్నారేమో అని గ్రామస్తులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

90 శాతం మంది కూలీలే..

సామయ్యవలస గ్రామ ప్రజలు చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. రైతు కూలీలుగా లేదా ఇటుక బట్టీలలో పనులకు వెళ్తుంటారు. కుటుంబం యావత్తూ కష్టించి పైసా పైసా కూడబెట్టి వారి భవిష్యత్తు, పిల్లల కోసం బంగారం, వెండి, డబ్బుల రూపంలో దాచుకున్నవి దొంగల పాలవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే ఇటుక బట్టీలకు తమ భూముల నుంచి మట్టి అమ్మి, భూములు విక్రయించి మరొకచోట పెట్టుబడులు పెట్టాలనుకున్న వారు కూడా ఈ గ్రామంలో చోరీ బాధితులుగా ఉన్నారు. విచిత్రం ఏమిటంటే గ్రామస్తులు తోటలు, ఇటుక బట్టీలకు పనులకు వెళ్లినా ఇంటికి తాళం వేయకుండా గెడలు పెట్టి వెళ్లిపోతారు. విలువైన వస్తువులు, డబ్బులు ఇంట్లో దాచుకోవడానికి కూడా భద్రత ఉండదు. చెక్క అల్మారా, చీరలలో మడత పెట్టి, తలగడల కింద వాటిని దాచుకుంటారు. ఎక్కడా సీసీ కెమెరాలు కూడా ఈ గ్రామంలో కనిపించవు. అయినప్పటికీ ఒకే గ్రామంలో వరుస చోరీలకు పాల్పడుతున్నా పోలీసులు వారిని పట్టుకోవడంలో వైఫల్యం చెందారా లేదా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అన్నది నిరక్ష్యరాస్యులైన గ్రామస్తులు నిర్ణయించుకోలేకపోతున్నారు. చోరులు మరిన్ని ఇళ్లకు కన్నం వేయక ముందే పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే గ్రామం వదిలి వెళ్లిపోవడం ఖాయమని బాధితులు వాపోతున్నారు.



పాండ్రంగి పంచాయతీలోని సామయ్యవలస గ్రామం

దర్యాప్తులో కానరాని పురోగతి

దాదాపు ప్రతి బాధితుడు ఒకరిద్దరు అనుమానితుల పేర్లను పోలీసుల ముందు ఉంచినా విచారణ జరపకపోగా వాళ్లు తమ ఇళ్లపై దాడులు చేస్తున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు ఏడాదిగా ఏడుగురు బాధితులు వరుస దొంగతనాలపై పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఒక్కశాతం కూడా పురోగతి కనిపించలేదు. ఇంకా పదుల సంఖ్యలో బాధితులు ఉన్నా, ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఒకరిద్దరు బాధితులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలుమార్లు కలెక్టర్‌కు, నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన పరిష్కార గడువులు ముగుస్తూనే ఉన్నాయి. దీంతో నెలలు గడచినా పోయిన వస్తువుల ఆచూకీని పోలీసులు కనుక్కోలేకపోవడంతో బాధితులు ఆశ వదులుకోలేక పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉదయాన్నే దోచేశారు..



ఈ ఏడాది ఏప్రిల్ 17న ఉదయం 5.45కు మా మల్లెతోటలో మొగ్గలు ఏరడానికి ఇంట్లోని ఆరుగురం వెళ్లిపోయాం. 7.30 గంటలకు తిరిగి వచ్చాం. ఇంట్లో అల్మారాకు వేసిన తాళం వేసినట్టే ఉంది. చీరల మధ్యలో ఉంచిన 9.5 తులాల బంగారు ఆభరణాలు, మట్టి అమ్మగా వచ్చిన రూ.3 లక్షల నగదు మాయమైంది. పోలీసులకు అనుమానితుల పేర్లు ఇస్తే ఇంటిపై దాడికి వచ్చారు. **–రొంగలి సాధు**, గ్రామస్తుడు

ఇల్లు గుల్ల చేశారు



గత కార్తీకమాసంలో ఉదయం 9 గంటలకు తాళం వేసి ఇంటి నుంచి రోడ్డు పక్కనే ఉన్న కిరాణా దుకాణం తెరవడానికి వచ్చాం. తిరిగి వెళ్లి చూసేసరికి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, అరకిలో వెండి వస్తువులు ఎత్తుకుపోయారు. నా భర్త రాజు ఏళ్ల తరబడి సంతలకు వెళ్లి కూడబెట్టిన కష్టాన్ని దోచుకున్నారు. **–వబ్బిలిశెట్టి పార్వతి**, సామయ్యవలస

కష్టార్జితం దొంగలపాలు



గ్రామంలో సీజన్‌లో జరిగే ఇటుకబట్టీలలో కూలిపనులకు వెళ్తుంటాను. రాత్రిపగలు కుటుంబమంతా కష్టపడి దాచుకున్నది దొంగలపాలైంది. గత ఏప్రిల్ 9 వేకువజామున 3 గంటల సమయంలో ఇంట్లో రూ.35వేల నగదు, 8 తులాల వెండి వస్తువులు, ఒక తులం బంగారం చోరీకి గురైంది. **–యర్ల రమణ**, సామయ్యవలస

మధ్యాహ్నం వేళ ఇంట్లో చొరబడి..



నేను మేకలు కాసుకోవడానికి ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిపోయాను. మా ఇంటి చుట్టూ ఇళ్లే ఉన్నాయి. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా తాళాలు తెరిచి ఒక తులం బంగారం, రూ.20 వేల నగదు పట్టుకుపోయారు. పోలీసులకు చెప్పినా ఇప్పటి వరకు అతీగతీ లేదు. **– పల్లి జుట్టమ్మ**, సామయ్యవలస

బంగారు ఆభరణాలు ఇప్పటికీ దొరకలేదు



నేను ఇటుకబట్టీలలో కూలిపనులు చేస్తుంటాను. 2024 ఫిబ్రవరిలో ఇంట్లో దొంగలు పడి మూడు తులాల బంగారు ఆభరణాలు కాజేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. **– ఇజ్జాడ రమణ**, సామయ్యవలస

జోన్-1 పీజీఆర్ఎస్‌కు ఎనిమిది వినతులు



పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఈఈ శాంతిరాజు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఎనిమిది వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి మూడు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, ప్రజారోగ్య విభాగానికి రెండు, రెవెన్యూ విభాగానికి ఒక వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

పెద్ద చెరువు పరిరక్షణకు వినతి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులకు చెందిన చిల్లపేట పెద్ద చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ చిల్లపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిలి జెడ్సీ అయ్యప్పనాయుడుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెరువు సుందరీకరణకు రూ.6.50 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని.. ఇప్పుడు మళ్లీ సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి వ్యర్థాలు చెరువులో కలిసేలా జీవీఎంసీ ప్రోత్సహించడం సరికాదన్నారు. చెరువు చుట్టూ పార్కును అభివృద్ధి చేయాల్సింది పోయి వ్యర్థాలతో కలుషితం చేయడం సమంజసం కాదని, చెరువును పరిరక్షించాలని కోరారు. జెడ్సీకి వినతిపత్రం అందించిన వారిలో వైఎస్సార్‌సీపీ రెండో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి ఉన్నారు.

జోన్-2కు 15 అర్జీలు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 15 అర్జీలు వచ్చాయి. ఈఈ శాంతిరాజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి-5, ఈఈ వర్క్స్- 3, వాటర్ సప్లై-4, రెవెన్యూ-2, ఎలక్ట్రికల్ విభాగానికి 1 చొప్పున 15 అర్జీలు వచ్చాయి. ఎండాడ జనసేన పార్టీ ఆఫీసు దగ్గర దసపల్లా లే అవుట్‌లో వీధిలైట్లు, తాగునీటి సమస్యపై దండ వేణు, హుద్ హుద్ కాలనీలో బోర్ల ఏర్పాటు, పీఎంపాలెం ముస్లిం కాలనీ బరియల్ గ్రౌండ్ పనులు ప్రారంభించాలని షేక్ సుభాని, మిథిలాపురి ఉడా కాలనీలో ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించాలని గణపతిరాజు త్రిమూర్తులు రాజు ఇలా పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, సూపరింటెండెంట్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న చిల్లపేట వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓ అధికారి కునికిపాట్లు..

మధురవాడ జోనల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ జరుగుతున్న క్రమంలో ఓ అధికారి కునుకు పాట్లు పడుతున్న విషయం సాక్షి కెమెరాకు చిక్కడంతో, అంతా నాలుక కరుచుకున్నారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భీమునిపట్నం: భవన నిర్మాణ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నర్సింగరావు డిమాండ్ చేశారు. భీమిలి జమ్మిచెరువు పార్కు సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పని చేస్తున్న కార్మికులకు, ఆ యాజమాన్యం వేతన బకాయిలు చెల్లించకపోవడంతో సోమవారం ఆ భవనం వద్ద కార్మికులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా కార్మికులకు వేతనాల చెల్లించడం లేదని, దీనివల్ల వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై యాజమాన్యానికి కార్మికులు అనేకసార్లు విన్నవించుకుంటున్నా ఫలితం ఉండడం లేదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జోన్ ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, మధురవాడ జోన్ కమిటీ నాయకుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. మెషీన్లు రిపేర్

రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల అవస్థలు



సాగర్‌నగర్‌లో సర్వర్ డౌన్ కావడంతో రేషన్ కోసం ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



ఎండాడ ఎస్సీకాలనీలో తెరుచుకోని రేషన్ డిపో

కొమ్మాది: కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల వద్ద సరకుల పంపిణీ ప్రారంభించిన దగ్గర నుంచి లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆదివారం రేషన్ పంపిణీ ప్రారంభించినా.. ఆరోజు తొలి రోజు కావడం.. కూటమి నాయకుల హంగామా.. అధికారుల రాకపోకలతో పంపిణీ నామమాత్రంగా జరిగింది. సోమవారం అయినా రేషన్ తీసుకుందామని లబ్ధిదారులు డిపోల దగ్గరకు వచ్చేసరికి జీవీఎంసీ 8వ వార్డులో పలు చోట్ల మూసివేయడం, మరికొన్ని చోట్ల సర్వర్ డౌన్ కావడంతో ఎండతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండాడ ఎస్సీ కాలనీ డిపో మూసివేశారు. మెషీన్ రిపేర్‌లో ఉందని డిపోకు ఓ పేపర్‌పై రాసి అంటించారు. 11 గంటలకు తెరుస్తామని రాశారు. అయితే లబ్ధిదారులు 11, 12, 1 గంట సమయాలకు వచ్చినప్పటికీ అవి తెరుచుకోలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. రుషికొండ, సాగర్‌నగర్ డిపోల వద్ద సర్వర్ డౌన్ కావడంతో లబ్ధిదారులు గంటల సమయం ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలి పనులకు, ఉద్యోగాలకు సెలవు పెట్టి మరీ డిపోలకు వస్తుంటే రెండు రోజులు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేదవాడి కడుపు కొట్టడమే అంటూ మండిపడుతున్నారు.

'బియ్యం డబ్బులు కావాలంటేనే మా వద్దకు రండి'

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ పథకాన్ని నిలిపివేసి కూటమి ప్రభుత్వం ఆదివారం నుంచి డిపోల ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీ భీమిలి నియోజకవర్గంలో అపహాస్యం పాలవుతోంది. గతంలో ఏయే డిపోల వద్ద వినియోగదారులు రేషన్ తీసుకున్నారో ఇప్పుడు అక్కడికి వెళ్తే డీలర్లు మొండిచేయి చూపిస్తున్నారు. డబ్బులు కావాలంటే తమ వద్దకు.. బియ్యం కావాలంటే వేరే డిపోలకు వెళ్లాలని సలహాలు ఇస్తున్నారు. లేదంటే భీమిలి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఎక్కడ రేషన్ తీసుకోవాలో అడగాలని హేళన చేస్తున్నారు. మూడు మండలాలలో వందల సంఖ్యలో వినియోగదారులు అయిదారు డిపోలకు వెళ్లినా కనికరించడం లేదు. కొందరు డిపోల చుట్టూ తిరగలేక డీలర్లు ఇచ్చే కిలోకు రూ.12 తీసుకుని వెళ్లిపోతున్నారు.

'కూటమి' దిగివచ్చేలా ..

- 'వెన్నుపోటు దినం' నిర్వహిద్దాం
- వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు
- 1, 2 వార్డుల్లో సమావేశాలు



రెండో వార్డు సంతపేటలో సమావేశమైన నాయకులు, కార్యకర్తలు



ఒకటో వార్డు కార్యకర్తలను సమాయత్తం చేస్తున్న అధ్యక్షుడు ప్రసాద్, రామునాయుడు

తగరపువలస: ఎన్నికల హామీలు నెరవేర్చని కూటమి నాయకులు దిగి వచ్చేలా వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4న నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ఉండాలని జీవీఎంసీ ఒకటోవార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు కోరారు. మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వరరావుతో కలిసి బాలాజీనగర్‌లో కార్యకర్తలను సమాయత్తం చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేలా ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం దద్దరిల్లేలా 500 ద్విచక్రవాహనాలతో ఒకటోవార్డు నుంచి భీమిలి వరకు రానున్నామన్నారు.

రెండో వార్డులో..

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెండోవార్డు సంతపేటలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కోరారు. శిల్లా వంశీరెడ్డి, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల శ్రీనివాసరావు, చేట్ల నరసింగరావు, వాసుపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలే శ్రీరామరక్ష



మాట్లాడుతున్న కేవీకే కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్

పద్మనాభం: భూసార పరీక్షలే నేలకు శ్రీరామ రక్ష అని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎస్.రాజ్ కుమార్ అన్నారు. మండలంలోని మద్ది, కోరాడ, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో ఆయన మాట్లాడారు. రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ రైతులందరూ పచ్చిరొట్ట ఎరువులు వేస్తే భూసారం పెరుగుతుందన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు భవాని, పరమేశ్వర్ మాట్లాడుతూ చెరకు పంటలో మెలకువలు, వరి పంటలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు ఎం.వెంకటేష్, కె.కిరణ్ మాట్లాడుతూ తెగుళ్లు, ఎరువుల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు, ఏడీ హరి కృష్ణ, ఏవో ఎంపీఎస్ చలం, కె.నగేష్ కుమార్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన ర్యాలీ

ఆరిలోవ: ఏపీఈపీడీసీఎల్ మధురవాడ డివిజన్ పరిధిలో అధికారులు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డు వరకు సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. వీటి వల్ల ఉపయోగాలు, కేంద్ర ప్రభుత్వం అందించే సహాయం గురించి ప్రచారం చేశారు.ర్యాలీలో మధురవాడ డివిజన్ సూపరింటెండెంట్ శ్యాంబాబు, జోన్-3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ, భీమిలి, ఆనందపురం, గోపాలపట్నం, పెందుర్తి డీఈఈలు పాల్గొన్నారు.

బంగారమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఊరంతా విద్యుత్ వెలుగులు



పద్మనాభంలో ఊరేగిస్తున్న బంగారమ్మ ఘటాలు

పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభంలో మూడు రోజులు జరగనున్న బంగారమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగించారు. రాజ వీధి, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో ఘటాలను తిప్పారు. ఘటాల్లో మహిళలు అన్నం వేసి పూజలు చేశారు. పద్మనాభం జంక్షన్ నుంచి గోస్తని వంతెన బ్రిడ్జి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు, అన్ని వీధులు, పద్మనాభం జంక్షన్, గ్రామంలో ఉన్న అమ్మవారి ఆలయాలు విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి. 2019 జూన్‌లో పండగ నిర్వహించారు. ఆరేళ్ల అనంతరం ఉత్సవాలు జరుగుతుండడంతో ఊరంతా పండగ సందడి నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడుతోంది.

డ్రైనేజీలు శుభ్రం చేశారు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు వలందపేటలో పారిశుధ్య కార్మికులు సోమవారం డ్రైనేజీలను శుభ్రం చేశారు. 'రజకవీధిలో అధ్వానంగా డ్రైనేజీలు' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు వెంటనే స్పందించారు. పారిశుధ్య సిబ్బందితో కాలనీలో, సర్వీస్ రోడ్డు వద్ద డ్రైనేజీలలో పూడికలను తొలగింపచేశారు. అయితే, ఈ గ్రామంలో డ్రైనేజీలకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అప్పలరాజు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, ఆదినారాయణ, గోవిందరావు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపు మేరకు ఎన్నికల హామీలు నెరవేర్చాలంటూ ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేదవారికి మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి ఇస్తామన్న రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. అలాగే పట్టణ ప్రాంత పేద ప్రజలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌ను కూటమి నాయకులు కొత్త పెన్షన్ల కోసం డిమాండ్ చేసేవారని, ఇప్పుడు వారు ఎందుకు కొత్త పెన్షన్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అన్ని రకాల పెన్షన్లతో పాటు అర్హులకు డయాలసిస్, వితంతు పెన్షన్లు తక్షణమే ఇవ్వాలన్నారు. ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చకపోతే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరన్నారు.